క్లుప్తంగా

బల్లికురవలో నేడు ఆసరా వారోత్సవాలు

బల్లికురవ: బల్లికురవలో గురువారం ఉదయం 10 గంటలకు ఆసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య బుధవారం తెలిపారు. మండలంలోని 1097 స్వయం సహాయక గ్రూపులకు 8.16 కోట్లు నాలుగో విడత ఆసరా చెక్కులను అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని చెప్పారు. మండలంలోని పొదుపు గ్రూపు మహిళలంతా ఈ వేడుకలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయండి



పుష్పగుచ్ఛాలు అందిస్తున్న విజయ్‌సారథి

చీరాల టౌన్: చీరాల మున్సిపాలిటీలోని సమస్యలను త్వరగా పరిష్కరించి చీరాలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని నూతన మున్సిపల్ కమిషనర్ విజయసారధికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. చీరాల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా విధుల్లో చేరిన విజయ్‌సారధి చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. మున్సిపాలిటీలో చేయాల్సిన పనులు, తదితర అంశాలపై కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ డీఈ ఐసయ్య, తదితరులున్నారు.

మార్టూరుకు ఇద్దరు సీఐలు

మార్టూరు: మార్టూరు సర్కిల్‌కు ఇద్దరు సీఐలను నియమిస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు అందినట్లు ఇన్‌చార్జి సీఐ, సంతమాగులూరు ఆర్. నరసింహారావు తెలిపారు. గుంటూరు వీఆర్ నుంచి ఎస్‌వీ రాజశేఖర్ రెడ్డి మార్టూరు అర్బన్ సీఐగా, గుంటూరు రేంజ్ వీఆర్ నుంచి మార్టూరు రూరల్ సీఐగా సి. సీతారామయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు.

క్రికెట్ క్రీడాకారిణులకు అభినందనలు

చినగంజాం: నరసరావు పేటలో జరిగిన అండర్ 17 బాలికలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికలు మరుప్రోలు తులసి (10 వ తరగతి), మరుప్రోలు చంద్రిక (9 వ తరగతి)ను పాఠశాల హెచ్‌ఎం ఎం. దేవదత్తం అభినందించారు. బాలికలకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. అనిల్ కుమార్, బాలికలకు పాఠశాల ఉపాధ్యాయులు డి. నారాయణ రెడ్డి, బి. నాగేశ్వరరావు, ఏ. వీరాచారి, పి. బ్రహ్మయ్య, కె. నాగరాజు, ఎన్. శ్రీరమణ, కుమార్, ఎన్. రమణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

చీరాల అర్బన్: పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రోడ్లు, డ్రైన్లు వంటివి అవసరమైన మేరకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం అజెండాలోని 43 అంశాల్లో మూడు అంశాలను రద్దు చేయగా మిగిలిన 40 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయసారథికి కౌన్సిలర్లు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. కమిషనర్ విజయసారథి, డీఈ యేసయ్య, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధి బాలలపై వివక్షత తగదు

● సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ప్రశాంతి

పర్చూరు (చినగంజాం): వీధి బాలల పట్ల వివక్షత చూపవద్దని వారిని ఆదరించాలని పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రశాంతి అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా నాగులపాలెం గ్రామంలోని శ్రీ బాలయోగి విద్యార్థినుల గురుకులంలో బుధవారం పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రశాంతి రాజ్యాంగం గురించి తెలియజేశారు. లింగ వివక్షత తగదని, ఆడ పిల్లలు, మగ పిల్లలను సమానంగా పరిగణించాలని సందేశం ఇచ్చారు. వీధి బాలలు ఎవరైనా తటస్థ పడినప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వం అధికారులకు సమాచారం అందించాలని తద్వారా ఆడపిల్లలను వారి తల్లిదండ్రుల వద్దకు లేదా వారి సమీప బంధువుల చెంతకు చేర్చేలా తగిన సహాయం చేయాలి సూచించారు. అటువంటి పిల్లలను అధికారులు విద్య నేర్పించేలా తగు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. లాయర్ సీహెచ్ శ్రీరమణి మాట్లాడుతూ విద్యార్థినులు గుడ్ టచ్, బాడ్ టచ్‌లోని అంతరార్థం గ్రహించాలని, ఎవరైనా తెలియని వ్యక్తులు పరిచయం లేకుండా అసభ్యంగా ప్రవర్తిస్తే తప్పక పెద్ద వారికి తెలియజేయాలని, అక్కడి నుంచి పారిపోయే విధంగా ప్రయత్నం చేయాలని తెలియజేశారు. నిర్బంధ ఉచిత విద్య ఆవశ్యకత తెలియజేశారు. ప్రిన్సిపాల్ పి. విశ్వరాణి మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలకు ఉచిత విద్య గురించి, ప్రభుత్వం వారు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ద్వారా పిల్లల సంరక్షణకు చేపడుతున్న చర్యలు వివరించారు. కార్యక్రమంలో జె. సుజాత, యు. అరుణ, వైస్ ప్రిన్సిపాల్ పి. స్వర్ణలత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, 570 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించిన న్యాయమూర్తి విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. హాస్టల్‌లోని వసతులను పరిశీలించారు. విద్యార్థినులను ఆహారం గురించి, సదుపాయలను గురించి వారికి అందుతున్న విద్య సదూపాయాలను గురించి తెలుసుకున్నారు.

వేమన పద్యపఠన పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం చీరాలలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో విద్యార్థులకు వేమన పద్యపఠన పోటీలను నిర్వహించారు. పోటీలకు చీరాల పరిసర ప్రాంతాల్లోని హైస్కూళ్ళ నుంచి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతిని వడ్డేపల్లి గాయత్రి (జెడ్పీ హైస్కూల్, కొత్తపేట), ద్వితీయ బహుమతిని మంతెన హర్షి (భాష్యం హైస్కూల్, చీరాల), తృతీయ బహుమతిని పెండెం హేమలక్ష్మి (జెడ్పీ హైస్కూల్, కొత్తపేట) అలానే టి. శ్రీనాగవల్లి (జెడ్పీ హైస్కూల్, అక్కాయపాలెం), ఎం .ఝాన్సీ (శ్రీచైతన్య హైస్కూల్, చీరాల), పి.మోహనసాయి (ఎంపీపీఎస్, జాండ్రపేట)లు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. న్యాయనిర్ణేతలుగా బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి వడలి రాధాకృష్ణ, సింహాద్రి యల్లమందారెడ్డి, ఎ.నాగవీరభద్రాచారి, గాదె హరిహరరావు, భవనం భద్రిరెడ్డి, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, మునీరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అవినీతి ఆరోపణలపై విచారణ



ఫిర్యాదు అందిస్తున్న పూర్వ విద్యార్థి రవితేజ

పర్చూరు (చినగంజాం): భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి పొదిలి ఎర్రయ్య బుధవారం విచారణ చేపట్టారు. అవినీతిపై గతంలో పాలక వర్గంలోని కొంత మంది సభ్యులు ముఖ్యమంత్రి, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఒకేషనల్ విద్యాశాఖ అధికారి బుధవారం కాలేజీకి వచ్చి విచారణ చేపట్టారు. పూర్వ విద్యార్థి రవితేజ లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదుని స్వీకరించారు. మండలంలోని నూతలపాడు జూనియర్ కళాశాలపై వచ్చిన ఫిర్యాదులపై కూడా ఆయన దృష్టి సారించినట్లు తెలిసింది. నివేదికను ఉన్నత అధికారులకు అందజేస్తామని తెలిపారు.

హోంగార్డు మహేశ్వర రెడ్డి సేవలు ప్రశంసనీయం



హోంగార్డు మహేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చీరాల టౌన్: హోంగార్డుగా 36 ఏళ్లపాటు విశేష సేవలందించిన హోంగార్డు జీవీ మహేశ్వరరెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎస్పీ వకుల్‌జిందాల్ కొనియాడారు. చీరాల యూనిట్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న మహేశ్వరరెడ్డి బుధవారం పదవీ విరమణ చేయడంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఘనంగా సత్కరించి సన్మానించి బహుమానాన్ని అందించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 36 ఏళ్లుగా హోంగార్డుగా పనిచేస్తూ పోలీసు విధుల్లో అంకితభావంతో విశేష సేవలందించిన మహేశ్వరరెడ్డిని పోలీసు శాఖ ఎన్నటికీ మరువదన్నారు. రిటైర్డ్ హోంగార్డులు, పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. పదవీ విరమణ చేసిన హోంగార్డుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సదుపాయాలను త్వరగా అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఆర్ డీఎస్పీ ప్రేమ్‌కుమార్, ఆర్‌ఐ ఎల్.గోపీనాథ్, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్.మన్మధరావు, వెల్ఫేర్ ఆఐ బి. శ్రీకాంత్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తులు ఆహార నియమాలు పాటించాలి

చీరాల అర్బన్: షుగర్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా ఆహార నియమాలను పాటిస్తూ వ్యాయామం చేస్తుండాలని షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ జి.నవీన్‌కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ క్షీరపురి సహకారంతో శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్‌లో బుధవారం షుగర్, గుండె, రెటీనా సమస్యలపై ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో గుండె వైద్యనిపుణులు డాక్టర్ కొసరాజు కమలాకర్, షుగర్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ నవీన్‌కుమార్, సీనియర్ ఆప్తాలిక్ ఆఫీసర్ తాడివలస కుమార్‌లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 86 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. తమ హాస్పిటల్‌లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు అన్నారు. షుగర్ ఉన్న వారు సంవత్సరానికి ఒకసారి గుండె, కళ్ళు, కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ జి.నవీన్‌కుమార్ సూచించారు. గుండె నొప్పి వచ్చినప్పుడు వెంటనే ఈసీజీ తీయించి గుండె పనితీరు తెలుసుకోవాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్ కమలాకర్ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ క్షీరపురి చీరాల అధ్యక్షులు నన్నపనేని రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, రోటరీ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీవిరమణ సహజం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎంఈవో ఉపాధ్యాయులు



భానుప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ బండారు అనూష దంపతులు

అద్దంకి రూరల్: ఉపాధ్యాయులు శృంగారపు నాగేశ్వరరావు సేవలు ప్రశంసనీయమని ఎంఈవో 1 డీ. గంగాధర్‌రావు అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు పాఠశాలలో ఉపాధ్యాయుడు శృంగారపు నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం అభినందన సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ఎంఈవో మాట్లాడుతూ 38 సంవత్సరాలుగా అంకిత భావంతో విశేష సేవలందించి ఉన్నతమైన వ్యక్తిత్వంతో వందలాది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం దుశ్శాలువాలతో సత్కరించారు. ఎంఈవో 2 బి. సుధాకరరావు, సర్పంచ్ గోరంట్ల పద్మావతి శ్రీనివాసరావు, కామేపల్లి నాగేంద్రమ్మ, హనుమంతరావు, అద్దంకి విద్యా కమిటి చైర్మన్ పెట్లూరి శాంతి, ఉపాధ్యాయులు ఎస్. నాగేశ్వరరావు, కోవి శ్రీనివాసరావు, దామా నాగేశ్వరరావు, పి. శంకరరావు, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, ఎం. శ్రీనివాసరావు, పి. వెంకటరావు, పీఈటీ కె. హనుమంతరావు పాల్గొన్నారు.

భాను ప్రసాద్ సేవలు అభినందనీయం

ఇంకొల్లు (చినగంజాం): మండల పరిషత్ కార్యాలయంలో భానుప్రసాద్ అందించిన సేవలు కొనియాడదగినవని ఎంపీపీ బండారు అనూష రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యానిర్వాహక అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న భానుప్రసాద్ వీడ్కోలు సత్కార సభ పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీఓ ఆర్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించగా ఎంపీపీ అనూష రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భానుప్రసాద్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సేవలు గురించి కొనియాడారు. అనంతరం భానుప్రసాద్ దంపతులకు సత్కరించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఎం టి. మోహనరావు, ఏపీఓ రేణుక పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి

బల్లికురవ: మన గ్రామాన్ని మనబాధ్యతగా అభివృద్ధి పరచుకుంటే గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తాయని ఉత్తర అమెరికా నాట్స్ బాధ్యులు మాదాల సాంబశివరావు, రాజేంద్ర అన్నారు. బుధవారం వల్లాపల్లి గ్రామం నుంచి వలపర్ల వెళ్లే రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చిల్ల చెట్లను పొక్లెయిన్‌తో తొలగించే కార్యక్రమం చేపట్టారు. గ్రామాల అభివృద్ధితోనే ఆర్థిక స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు అండ



రంగప్పనాయుడువారిపాలెంలో క్యాంపు పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మం

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషిన్ అనేది మంచి ఫలితాలు అందిస్తున్నాయని జిల్లా ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మం అన్నారు. బుధవారం స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలోని రంగప్పనాయుడువారిపాలెంలో నిర్వహిస్తున్న 104 మెడికల్ క్యాంపును తనిఖీ చేశారు. అక్కడకు వచ్చే పేషెంట్లతో మాట్లాడారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. గతంలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి? ప్రస్తుత ప్రభుత్వంలో అందుతున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయో అని ఆరా తీశారు. రోగుల నుంచి వస్తున్న స్పందనతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వైద్య పరీక్షల కోసం వెళితే రోజంతా సరిపోయేదని, ఇప్పుడు గ్రామానికి వచ్చిన వైద్యులు తమ ఇంటికి కూడా వచ్చి వైద్య సేవలందించడం ఎంతో సంతోషంగా ఉందని వారు చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలందిస్తామన్నారు. బీపీ, షుగర్‌లతో పాటు, అనేకమైన జబ్బులకు ఇంటి వద్దనే వైద్య సేవలందుతున్నాయన్నారు. 104 బాపట్ల డీఎం నాగేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హస్మప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెనర్జీ సేవలు మరువలేనివి



బెనర్జీ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎంఈఓ సత్యన్నారాయణ

కారంచేడు: ఉపాధ్యాయునిగా కారంచేడు మండలంలోని పనిచేసిన వి. బెనర్జీ అందించిన సేవలు మరువలేనివని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సాయంత్ర మండల కేంద్రమైన కారంచేడు యూపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడారు. కారంచేడు ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలో ఆయన సుదీర్ఘ కాలం పనిచేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఇటీవల ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల వీలీనంలో భాగంగా ఆయన మండలంలోని స్వర్ణ మొయిన్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంస్మరణ సభలో ఆయన సేవలను ఉపాధ్యాయులు నెమరవేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ తరఫున ఆర్థిక సహాయాన్ని అందించారు. యూటీఎఫ్ నాయకునిగా, ఉపాధ్యాయునిగా ఆయన అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. బాపట్ల జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినయ్‌కుమార్, ఏజ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు భిక్షాలు, రావి పద్మావతి, భవనం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. శ్రీనివాసరావు, రమేష్‌రెడ్డి, పావులూరి, శీరాం పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో బలరాం, హనిమిరెడ్డి



పుట్టినరోజు వేడుకలకు హాజరైన బలరాం, హనిమిరెడ్డి

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మక్కెన వెంకటరామారావు మనమడు వర్షిత్ పుట్టిన రోజు వేడుకలకు బుధవారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి హాజరయ్యారు. రామారావు కుమార్తె మేఘన,అల్లుడు ఆళ్ల మోహన్, మనవడు వర్షిత్‌లను ఆశీర్వదించారు. వర్షిత్ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకోవాలని శుభకాంక్షలు తెలియజేశారు. కొమ్మినేనివారిపాలెం సొసైటీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణయ్య, స్థానిక నేతలు ఎల్చూరి రవీంద్ర, బుర్రి ఆదినారాయణ, బొంతా మోహన్, మహమ్మద్ వలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



కారంచేడులో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యన్నారాయణ

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు ఎన్‌టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని రరాల రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం మరింత పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పథకాలపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూలో ఎలాంటి మార్పులు లేకుండా జాగ్రత్తగా పరిశీలించుకోవాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్మశానానికి రహదారి వసతి కల్పించాలి

బల్లికురవ: గ్రామ ఎస్సీ శ్మశాన వాటిక రహదారి వసతిలేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కందుకూరి పేతురు మాదిగ, కాలనీవాసులు బుధవారం తహసీల్దార్ కె. రవిబాబుకు విన్నవించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి శ్మశాన వాటికకు రహదారి వసతి కల్పించి సర్వేతో హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో గనిపల్లి ప్రభాకరరావు, జోన్నలగడ్డ ఆదెయ్య, సందిపోగు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. కాగా బల్లికురవ నుంచి అద్దంకి వెళ్లే రోడ్డులో తూర్పు భాగంలో సర్వే నంబర్ 771 ఎ1లో 40 సెంట్లలో ఉన్న శ్మశాన వాటికను చిల్ల చెట్లు అలుముకోవడంతో ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పరుస్తున్నట్లు ఏపీఓ బాలకృష్ణ నాయక్ చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో మద్యం స్వాధీనం

చీరాల రూరల్: చీరాల రైల్వే స్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహించగా 14 మద్యం (లీటర్) బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య బుధవారం రాత్రి తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, ఒంగోలు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్లు, రైలు బండ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై రైల్వే ఆర్పీఎఫ్ సీఐ వి. శ్రీనివాసరావుతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులు కలిగి ఉన్నారని, వారి బ్యాగులను తనిఖీలు చేయగా అందులో మ్యాన్షన్ హౌస్ లిక్కర్ బాటిల్స్14 ఉన్నాయని చెప్పారు. దీంతో ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రైల్వే స్టేషన్‌లో కానీ రైలు బండ్లలో కానీ అక్రమంగా మద్యం, అక్రమ నగదు, గంజాయి, మాదక ద్రవ్యాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకు రెండు కళ్లు



పల్లెపల్లెకు హనిమిరెడ్డిలో సమస్యలు తెలుసుకుంటున్న హనిమిరెడ్డి

బల్లికురవ: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అద్దంకి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పానెం చినహనిమిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో రూ. 75 లక్షలతో నిర్మించిన సచివాలయం , రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగారు. అద్దంకి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రభాగంలో ఉంచేందుకు కృషిచేస్తానని ప్రకటించారు. గ్రామ కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటవారిపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సామాజిక భవనానికి మండల నిధులతో ప్రహరీ నిర్మించగా హనిమిరెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, సర్పంచ్ పసుమర్తి మహాలక్ష్మమ్మ, కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, మంచాల శ్రీనివాసరెడ్డి, కట్టా సుధాకర్, బొడ్డపాటి వీర లక్ష్మారెడ్డి, కల్లి గోవిందరెడ్డి, రామిరెడ్డి, వజ్రాల వెంకట రామిరెడ్డి, సరిమళ్ల సురేష్, ఒంటరి నాగరాజు, కల్లి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, పంచాయితీ రాజ్ ఏఈ జి. హనుమంతరావు, సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండాలి

చినగంజాం: గ్రామాల్లో వ్యర్థాల నిర్వాహణ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ కె. స్వరూపరాణి సూచించారు. బుధవారం ఐటీసీ బంగారు భవిష్యత్ మరియు సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో చినగంజాం మండల కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీలకు మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెర్ప్ సంస్థ ఏపీసీ నారాయణ.. వ్యర్థాల సేకరణ, క్లాప్ మిత్రలు, జీతాలపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ ఎన్. వేణుగోపాలకృష్ణమూర్తి, సీఓ అరుణ్ హాజరయ్యారు.

ఇంకొల్లు నుంచి బైక్ ర్యాలీ

మార్టూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ సవిలేవిలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంకొల్లు నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు 100కు పైగా బైకులు, 10 కార్లతో ర్యాలీగా అనుసరించి మార్టూరు మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఉప్పలపాటి చెంగలయ్య, తాటి వెంకట్రావు, అట్టూరి సుకుందరావు, కారంచేడు నీరుకట్టు వాసుబాబు, దండా చౌదరి, రాజా నాయక్, తదితరులు పాల్గొన్నారు.